సంచలన సాయంకాల పత్రిక
# సత్య
మంగళవారం 20-5-2025
సంపుటి: 21 సంచిక: 48
పేజీలు : 8 వెల: రూ.1



• ఎడిటోరియల్

# రక్షణ ఎగుమతుల నుదుట 'సింధూరం'

భారత్–పాకిస్తాన్ మధ్య తలెత్తిన తాజా ఘర్షణలు.. తత్ఫలితంగా జరిగిన దాడులు, ప్రతిదాడుల ప్రభావం మిగతా అంశాలపై ఎలా ఉన్నా.. భారత్‌కు మాత్రం ఒకరకంగా బాగా కలిసి వచ్చిందనే చెప్పాలి. గతంలో ఆయుధాల దిగుమతులపైనే ఆధారపడిన భారతదేశం కొన్నేళ్లుగా ఆ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. రక్షణ పరికరాల పరిశోధన, తయారీలో అనూహ్యమైందని ప్రగతి సాధించింది. పాక్‌పై భారత్ జరిపిన తాజా దాడులే దీన్ని నిరూపిస్తున్నాయి. పహల్గాం దాడి నేపథ్యంలో పాక్‌తోపాటు పీవోకేలో ఉన్న ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడులు చేసి తొమ్మిది శిబిరాలను నాశనం చేస్తే.. దానికి ప్రతీకారంగా పాక్ సైన్యం భారత సరిహద్దుల్లోని పౌర ఆవాసాలు, సైనిక స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడికి పాల్పడింది. అయితే భారత్ తన ఆయుధ సంపత్తితో వాటిని గాల్లోనే నాశనం చేయడంతోపాటు పాక్ భూభాగంలోని 11 ఎయిర్ బేస్‌లు, పలు నగరాలపై దాడులు చేసి తీవ్ర నష్టం కలగజేసింది. పాకిస్తాన్ ప్రయోగించిన టర్కీ, చైనాల తయారీ డ్రోన్‌లు, క్షిపణులను భారత్ గాలిలోనే కూల్చివేయడం అంతర్జాతీయంగా భారత ఆయుధ శక్తిపై మొదటిసారి ఆసక్తి, ఆశ్చర్యం రేకెత్తించింది. భారత్ ప్రధానంగా రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్ 400 వ్యవస్థను ఉపయోగించినా.. దాంతోపాటు భారత్ స్వయంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులను తొలిసారి ఆపరేషన్ సింధూర్‌లో ప్రయోగించడం, అవి అద్భుతంగా పనిచేయడం విశేషం. ప్రధానంగా అమెరికాతోనే పోటీ పడుతున్న చైనీస్ సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణులను మన బ్రహ్మోస్, ఆకాశ్ వ్యవస్థలు తుత్తునీయలు చేయడం ప్రపంచ ఆయుధ వ్యాపార రంగాన్ని భారత ఆయుధాల వైపు చూసేలా చేసింది. మన రక్షణ ఉత్పత్తులకు అమాంతంగా డిమాండ్ పెంచేసింది. అత్యంత భారీగా ఖర్చు చేసి అమెరికా, రష్యా, చైనా వంటి అగ్రదేశాల నుంచి ఆయుధాలు కొనే శక్తి లేని అనేక చిన్న, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇప్పుడు భారత ఆయుధాల వైపు ఆశగా చూస్తున్నాయి. తమ రక్షణ బడ్జెట్‌కు అందుబాటులోనే ఉన్న భారత ఆయుధాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నాయి. ఫలితంగా మన రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగి దిగుమతి బడ్జెట్‌పై భారం తగ్గించే అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా బ్రహ్మాస్త్రం లాంటి బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేయడానికి ఏకంగా 17 దేశాలు క్యూ కట్టాయి. ఇప్పటికే ఫిలిప్పీన్స్ వీటి కోసం భారత్‌తో 375 మిలియన్ డాలర్ల డీల్ కుదుర్చుకుంది. ఇందులో మొదటి దశ ఆయుధాలను కూడా ఫిలిప్పిన్స్ అందుకుంది. దాంతోపాటు మలేషియా, థాయ్‌ల్యాండ్, సింగపూర్, బ్రూనై, బ్రెజిల్, చిలీ, అర్జెంటీనా, వెనిజులా, ఈజిప్ట్, దక్షిణాఫ్రికా, బల్గేరియా, మరికొన్ని మధ్యప్రాచ్య దేశాలు బ్రహ్మోస్ క్షిపణి కొనుగోలుకు ఆసక్తి చూపుతూ ఇండియాతో చర్చలు జరుపుతున్నాయి. దీంతోపాటు భారత్ అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, యాంటీ డ్రోన్ వ్యవస్థ (డీ4), ఇటీవల జరిపిన పరీక్షల్లో అద్భుత ఫలితం చూపిన నాగాస్త్రం వంటి ఆధునాతన ఆయుధ సంపత్తి కూడా ప్రపంచ ఆయుధ మార్కెట్‌ను ఆకర్షిస్తున్నాయి. వీటి కొనుగోలుకు పలు దేశాలు పోటీ పడుతున్నాయి. గత కొన్నేళ్లుగా మనదేశం మన అవసరాలకు సొంతంగా ఆయుధాలు తయారు చేసుకుంటూనే.. ఇతర దేశాలకు అమ్మేందుకు వీలుగా ప్రణాళికలు అమలు చేస్తోంది. ఫలితంగా ఇటీవలి కాలంలో రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు క్రమంగా పెరుగుతూ మన రక్షణ బడ్జెట్‌పై భారం తగ్గిస్తున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు రూ.23,622 కోట్లకు చేరి చరిత్ర సృష్టించాయి. 2023–24లో రూ.21,083 కోట్ల విలువైన ఎగుమతులు జరగ్గా.. గత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతుల్లో 12.04 శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. అదే ఒక దశాబ్దం వెనక్కి వెళితే.. 2013–14లో మన దేశ రక్షణ ఎగుమతులు రూ.686 కోట్లు మాత్రమే. ప్రస్తుతం భారత్ 80 కి పైగా దేశాలకు రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. 2029 నాటికి రూ.50 వేల కోట్లకు ఎగుమతులు పెంచడం ప్రభుత్వ లక్ష్యం. ఆపరేషన్ సిందూర్ భారత ఆయుధ సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేసి ఆ లక్ష్యాన్ని చాలా ముందుగానే, అతి సులభంగా సాధించేందుకు మార్గం సుగమం చేసిందని నిపుణులు చెబుతున్నారు. సైనిక పరికరాలు, ఆయుధాలు, విడిభాగాలు, మందుగుండు సామగ్రి తదితర విభాగాల్లో భారత్ విజయవంతమైన ఎగుమతిదారుగా మారుతుండటం గర్వకారణమైన ముందడుగు.

# అఖిలభారత సమ్మె జయప్రదం చేయండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్మికహక్కులు కాలరాసే లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణకై కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు జూలై 9న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని ఉద్యోగ,కార్మిక సంఘాలు నాయకులు పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక 4లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ మే –20న దేశ వ్యాప్త సమ్మె జూలై 9కి వాయిదా వేసినప్పటికీ మే 20న దేశవ్యాప్తంగా నిరసనలు తెలియచేయాలని కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం శ్రీకాకుళం డైమండ్ పార్కు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు,వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44కార్మిక అనుకూల చట్టాలను మోడి నాయకత్వం లోని కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలు కోసం 4లేబర్‌కోడ్‌లుగా మార్చి వేసిందని విమర్శించారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, యజమానుల దోపిడీని, అక్రమ తొలగింపులను, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడం కోసం మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లు తెచ్చిందని విమర్శించారు. 8గంటల పని దినాన్ని 12గంటలకు పెంచడానికి, యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించేలా, పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని అన్నారు. ప్రతి 5 సంవత్సరాలకు సవరించాల్సిన కనీస వేతనాలు గత 18 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం సవరించలేదని కార్మికులు వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ.26,000లుగా నిర్ణయించి అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్. ప్రకాశరావు, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, ఎల్ఐసి, మెడికల్ రిప్స్, కళాసీ, యండియం, హమాలీ, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు కె.సూరయ్య, యం. ఆదినారాయణమూర్తి, యం.గోవర్ధనరావు, డి.వాసుదేవరావు, బి.చిన్నారావు, సింహాచలం,టి.ప్రవీణ, యం.త్రినాథ్, పి.యర్రయ్య, బి.చిన్నారావు, కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# అతిగా రసాయనాలు వాడొద్దు

(సత్యంన్యూస్, మందస)

గ్రామీణ ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయం ప్రగతికి రైతులందరూ పూర్తి అవగాహన పొంది, పొలంలో అతిగా రసాయనాలు వాడొద్దని, పంటల బాగుకు సేంద్రియ కషాయాలే ముద్దు అని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సోమవారం మందస మండలంలో గల చిన్న బరంపురం లో సర్పంచ్ ప్రతినిధి లక్ష్మణరావు, గ్రామపెద్దలు మెట్ట మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ రైతుల అవగాహనర్యాలీ తదనంతరం రసాయనాలు వద్దు కషాయాలే ముద్దు అని నేలతల్లి ఆరోగ్యానికి నవధాన్యాల సాగు అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాన పంటతో పాటు ఈ నవధాన్యాల మొక్కలు పొలంలో పుట్టడం వల్ల పైరుకు మేలు చేసే సూక్ష్మజీవులు వాటి వేళ్ళ ద్వారా నేల గుల్ల బారి వాన పాములు లాంటి మిత్ర పురుగులు అభివృద్ధి చెందుతాయని వివరించారు. పచ్చి రొట్ట ఎరువులు, కుళ్ళిన పేడ, పశువుల ఎరువు, పెంటగత్తం, ఉపయోగిస్తూ, యూరియా లాంటి రసాయనాలను బాగా తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్న ముగ్గురు రైతులను గుర్తించి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు మెట్ట శారద, క్లస్టర్ కోఆర్డినేటర్ స్వామి నాయుడు, వి.వో.ఏ. నాగమణి , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.సి.ఆర్.పి.లు కృపాసింధు, లక్ష్మణ రావు, బాలకృష్ణ, ఐ.సి.ఆర్.పి.లు భారతి, కరుణ, కళ్యాణి, ప్రసాద్, లక్ష్మీనారాయణ, అగ్రికల్చర్ ఆఫీసర్ నాగరాజుతో పాటు ప్రకృతి వ్యవసాయ రైతులు, మహిళలు పాల్గొన్నారు.



# విద్యార్థిభవన్ స్కూల్‌లో పుస్తకాలు విక్రయాలను అడ్డుకున్న ఏబీవీపీ నాయకులు

(సత్యంన్యూస్, నరసన్నపేట)

నరసన్నపేటలో ఉన్న కొన్ని స్కూళ్లను అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు మంగళవారం సందర్శించారు అందులో భాగంగా విద్యార్థి భవన్ అనే ఒక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి పుస్తకాలు సుమారు రూ.5 నుండి 7వేలకు విక్రయిస్తున్నారని తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు ఆ స్కూల్ పుస్తకాలను స్థానిక ఎంఈఓ ఆఫీస్‌కు తరలించారు. ఇంకా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా సరే పుస్తకాలు విక్రయిస్తే విడిచి పెట్టేది లేదని పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్ కుమార్, జస్వంత్, పవన్ కుమార్, దేవా మొదలగు కార్యకర్తలు హెచ్చరించారు.



# "రిమ్స్ అన్నపూర్ణ సేవ'కు రూ.10వేల వితరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం పట్టణానికి చెందిన దేశిరాజు వెంకట శ్రీనివాస్ తన తల్లిదండ్రులు దేశరాజు సూర్యారావు, సత్యవతి పెళ్లిరోజు సందర్భంగా శ్రీకాకుళం రిమ్స్‌లో రోగుల సహాయకులకు నిర్వహిస్తున్న నిత్య నారాయణ సేవకు పది వేల రూపాయలు జిల్లా భజన్స్ ఇన్‌చార్జ్ గంగాధర్ ద్వారా రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావుకు అందచేశారు. కార్యక్రమంలో రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ అధ్యక్షులు గంగుల రమణబాబు, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, సెక్రటరీ కిల్లాన ఫల్గుణరావు, పదాధికారులు బోయిన నరసింహామూర్తి, పప్పల నాగేశ్వరరావు, వటవృక్షాల మూర్తి, చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రోగుల సహాయకులకు మధ్యాహ్నం రాత్రి రెండు పూటలా నిస్వార్థంగా ఆహారం అందిస్తున్న సేవలకుగాను గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, దీర్ఘరోగులకు, శ్వాసకోశ రోగులకు అందిస్తున్న వేడినీరు, మినరల్ వాటర్ సేవలను కూడా అభినందిస్తూ విరాళాన్ని అందజేయడం సంతోషమని తెలిపారు.






# రెండు హృదయాల మూగరోధన!

మౌనరాగం..
సినిమా రిలీజ్ అయిన 31 సంవత్సరాల తరువాత రాస్తున్న నా రివ్యూ..(అప్పుడు రాసాను 2017) ఈ అభిప్రాయాలు కేవలం అంటే కేవలం నావే.. ఈ మధ్య కాలంలో మనం తరచుగా సినిమా ప్రియులు వినేమాట స్టోరీ హీరోకి న్యారే ట్ చేసాము 6 గంటలు, పది గంటలు పట్టింది. హీరో గారు ఈ స్టోరీ విని మనం పక్కా ఈ సినిమా చేస్తున్నాం అని...

అసలు ఈ సినిమా కథని హీరోకి, హీరో యిన్‌కి ఏమని చెప్పి ఒప్పించారు ? ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు.. అసలు ఇప్పుడు ఈ స్టోరీ చెబితే ఎందరు హీరోలు ఒప్పుకుంటారో ? అతి మాములు స్టోరీ.. సినిమా పరిబాషలో మాట్లాడితే ఒక చిన్న లైన్.. కాని ఇక్కడ దర్శకుడు మణిరత్నం గారు మరి..

**- బాలూ ఇక్బాల్**

అటు చూస్తే ఆ టైంలో పీక్ స్టేజ్‌లో మోహన్ గారు,రేవతి గారు, కార్తీక్ గారు.. ఎలా కలపాలి ఈ చిన్న లైన్ ఉన్న సినిమాని అంత పెద్ద హీరోలతో, రేవతి లాంటి నటితో. దాన్ని కలిపే అద్భుతమైన మంత్రం ఇళయరాజా సంగీతం. అక్కడ మొదలైంది మౌనరాగం.. అవును..

మౌనరాగం.. అది హృదయంలోంచి రావాలి.. మనసుని తాకుతూ అలా గుండెలనిండా హాయిని నింపుతూ మన జ్ఞాపకాల పొరల్లోకి జారిపోయి నిక్షిప్తమైపోవాలి.. వేణువు అదే మురళిని చూసే వుంటారు. కాని రసాస్వాదన చేసివారికి దానిలో గాలిని ఊది ఏ రంధ్రం మూసి ఏ రంధ్రం వదిలితే ఏ రాగం వచ్చి మన మోముపై చిరునవ్వుని చేరుకుంటూ మనసుకి హాయిగా అనిపిస్తుందో అదే తరహా..

ఇక కాస్త సినిమా వైపుకి వెళ్తే ఏం లేదు అక్కడ రెండు హృదయాలు పడే మూగవేదన ఈ మౌనరాగం.. అర్థం చేసుకున్నవారికి చేసుకున్నంత..

30 సంవత్సరాల క్రితమే సూటితనం, మొండితనం కలగలిసి ఉన్న ఒక చదువుకుంటున్న అమ్మాయి జీవితంలోకి సడెన్ పెళ్లి అనే ప్రస్తావన రావటం, ఎందుకు చేసుకోవాలి, ఎందుకు చేసుకోకుండా ఉండవచ్చు అని తర్జన భర్జనలు చివరికి ఎమోషనల్ బ్లాక్మెయిల్‌తో ఒకరికి భార్యగా మారటం..

ఇక్కడే అసలు ట్విస్ట్.. తన లైఫ్‌లో ఇంతకుముందే ఒక ఇడియట్ లాంటి వ్యక్తి మెరుపు వేగంతో రావటం. అంతే వేగంతో మాయమైపోవటం. దానివల్ల అంత మొండిగా వున్న ఆమె ఇంకా మొండితనంతో మారటం. ఆమెని మార్చుకుందాం అని ఆమె భర్త పడే ఇబ్బంది కాని ఆమెకి ఎటువంటి ఇబ్బంది కలగకుండా తను చూసుకోవటం..ఇలా అన్నీ సన్నివేశాలు ఒకదానికొకటి అల్లుకుపోయు ఉంటాయి.ఇలా అన్నీ లింక్ బై లింక్‌గా అన్ని సన్నివేశాలు వస్తున్నా మనసుకు హత్తుకునేట్లు రావటానికి రెండు బలమైన మాధ్యమాలుండనే ఉన్నాయి.

*ఒకటి ఇళయరాజా నేపథ్య సంగీతం..*
*మరోటి పిసీశ్రీరాం చాయాగ్రహణం..*

సినిమా చూస్తున్నంత సేపు మీరు అదే లొకేషన్ లో వున్నట్టు మైమరచిపోతారు..మౌనరాగం అంటూనే గుండెల్ని పీల్చిపిప్పి చేసే సంగీతం. కళ్ళకు హాయి గొలిపే అద్భుతమైన ఛాయాగ్రహణం ..

చెలీ రావా వరాలీవా, మల్లె పూల చల్లగాలి మంట రేపే సందె వేళలో ఈ రెండు పాటలు ఇంకా కొన్ని తరాలవరకూ వింటూనే వుంటారు.

రేవతి గారి కళ్ళతో చేసిన అభినయం, మోహన్‌గారి సెటిల్డ్ యాక్టింగ్, ఎవరు ఎంతవరకు నటన చెయ్యాలో కొలిసి మరీ 100% ఇచ్చేసిన సినిమా.

(సన్నివేశాలు రాయటం మొదలుపెడితే ఏ సన్నివేశాన్ని వదలినా నా తప్పు అవుతుంది అందుకు హాస్పిటల్ సన్నివేశం గురించి కాని, కాలేజ్ సీన్స్‌లో ఐలవ్‌యు కాని, తను దొంగతనం చేసింది అంతకు ముందు ఆక్సిడెంట్ చేసిన వారికి హెల్ప్ చేద్దాం అని తెలిసినప్పుడు, చుట్టూ నాలుగు గోడల గురించి మాట్లాడే సన్నివేశం కాని, పైనుండి నీళ్ళు పోసే సన్నివేశం కాని, రేవతి నాన్నగారు ఆమె పెళ్ళికి ఒప్పుకుంది అని తెలిసినప్పుడు. దగ్గరకు రామ్మా నిజంగా ఇష్టం వుండే ఒప్పుకున్నావా అని అడిగే సన్నివేశం గురించి కాని లాస్ట్‌లో పేపర్స్ చింపేసి అవే అక్షింతలుగా ఎగిరే. ఇలా ఎన్ని చెప్పాలి)

చివరగా పైన ఇడియట్ లాంటి వ్యక్తి అన్నాను గుర్తుందా, అతనే కార్తీక్..

ఇతని పాత్ర పరిచయం అయినప్పటి నుండి వుండే 15 నిముషాలు సీన్స్ యిప్పటికీ చూస్తూనే వున్నాం..(ఇడియట్, ఇత్యాది సినిమాలకు మాతృక లాగా ఈ పదిహేను నిమిషాల కార్తీక్ క్యారెక్టర్..)

ఈ సినిమా చూసి నిజంగా అలాంటి ఇడియట్‌ని ప్రేమించి పెళ్లి చేసుకోవాలి అని భావించేవాళ్ళూ కూడా నాకు తెలుసు.. భర్తకి ఇబ్బంది కలిగితే భార్య పడే ఇబ్బంది, భార్యకి ఇబ్బంది కలిగితే భర్త పడే ఇబ్బంది చూసి ఇలాంటి భర్త మాకు దొరికితే మహాభాగ్యం అనుకున్న వాళ్ళూ నాకు తెలుసు..



## విజ్ఞానం కోసమే శిక్షణా తరగతులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజ్ఞాన కోసమే వేసవి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు బలగ శాఖా గ్రంధాలయ అధికారి పి.ఉగ్రసేను పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం ముందుగా పిల్లలకు యోగాసనాలు నేర్పించారు. తదుపరి కథలు తెలుగు పద్యాలు చెప్పి అనంతరం ఆటలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయకురాలు కె. అనిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్మిక, ఉద్యోగ హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేసారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కార్మిక, ఉద్యోగ హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లకు ఒకసారి సవరించాల్సిన కనీస వేతనాలను గత 20 ఏళ్లుగా సవరించలేదన్నారు. దీని వలన కార్మికులు వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నారన్నారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ.26వేలుగా నిర్ణయించి అమలు చేయాలన్నారు. కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను మోడీ నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాలు కోసం 4 లేబర్ కోడ్‌లుగా మార్చేసిందన్నారు. పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అంబటి సత్యన్నారాయణ, ఎల్.రామప్పడు, ఎమ్.రమణ, పి.సుధాకర్‌బాబు, కేదారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## అసంఘటిత రంగ కార్మికులకు భద్రతా చట్టం చేయాలి




(సత్యంన్యూస్, పలాస)

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రైతు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కార్మికులకు రూ.26వేలు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, అసంఘటిత రంగ కార్మికులకు భద్రతా చట్టం చేయాలని, స్కీమ్ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఈ జరగాల్సిన అఖిల భారత సమ్మె జులై 9కి వాయిదా వేసిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా నిరసనలకు పిలుపునిచ్చాయి. ఈ పిలుపులో భాగంగా కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, రైతు సంఘాలు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఏఐసిసిటియు జిల్లా నాయకులు కె.దుశ్యంత్‌లు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు విడనాడాలని డిమాండ్ చేశారు. దేశ పరిస్థితులు దృష్ట్యా విశాల దృక్పధంతో ఈ రోజు సమ్మె వాయిదా వేసినా జులై 9 న విజయవంతంగా సమ్మె నిర్వహిస్తామని తెలిపారు. కార్మిక, ప్రజా సమస్యలు పట్ల ప్రభుత్వం ఆలోచించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి అజయ్‌కుమార్, జీడిరైతులు టి.రాజు, సురేష్, కాష్యూ లేబర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శిష్టు గోపి, అంబటి ఆనంద్, ఏఐసిసిటియు నాయకులు కె.లోకనాధం, పి.నాగేశ్వరావు, ఏపీ రైతు సంఘం నాయకులు కె.హేమసూదన్, కె.బాలాజీ, డి.కామేసు, సీపీఎం కార్యకర్తలు ఎన్.ఢిల్లేశ్వరి, కె సుహాసిని,ఆటో యూనియన్ నాయకులు యస్‌కె.బషీర్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం స్థానిక కలెక్టర్ బంగ్లా దగ్గర ఉన్న బెహరా మనో వికాసకేంద్రంలో శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ దుంగ శ్రీధర్, శ్రీకాకుళం పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు, శ్రీకాకుళం జిల్లా కళ్యాణ్‌రామ్ ఫ్యాన్స్ అధ్యక్షులు స్టేట్‌వైడ్ కన్వీనర్ బుర్రి మధు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి, శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి హాజరయ్యారు. కేక్ కట్ చేసి అభిమానులకు మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఉచిత డెంటల్ క్యాంప్, రక్తదాన, అన్నదాన, సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయమన్నారు. జూనియర్ ఎన్టీఆర్ ఇంకా ఎన్నో మంచి సినిమాలు నటించి ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మిరాజ్యం, ఎన్టీఆర్ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు పీవీ రమణ, ఉపాధ్యకులు పి.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, వై.ప్రసాద్, శ్రీనివాస కార్తిక్, ఉమ్మిడివరపు గంగరాజు, ఇంటి శంకర్, రమణ మూర్తి, గంగు మల్లేసు, అంధవరపు శ్రీనివాసరావు, బి.కోటిరెడ్డి, బాడీ బిల్డర్ విజయ్, కె.లక్ష్మణ్ రెడ్డి, డి.ప్రసాద్, ఈశ్వర్, వి.పైడిరాజు, జగదీష్, అల్లక మల్లికార్జున, కళ్ళేపల్లి రమణ మూర్తి,ప్రియ చిట్టి బాబు, దాస్యం రాంబాబు, బి.కళావతి, పద్మ, కమల, యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.



## మరోసారి మానవత్వం చాటుకున్న జనసైనికులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గత కొద్దిరోజుల క్రితం తోటి జనసైనికుడు సవర రమేష్ తమ కుటుంబపోషణ కొరకు సెంటరింగ్ పనులు చేస్తుండగా దురదృష్టవశాత్తూ మూడు అంతస్థుల బిల్డింగ్‌పై నుండి పడిపోయాడు. ఈ ప్రమాదంలో మెదడు, కడుపులో తీవ్రమైన గాయాలు కావడంతో శస్త్రచికిత్స కూడా నిర్వహించారు. ఇతను నిరుపేద గిరిజన కుటుంబం అని తెలుసుకున్న జనసైనికులు అందరూ కలిసి ఆ కుటుంబానికి మేమున్నామనే భరోసా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు రిమ్స్ హాస్పిటల్‌కి వెళ్లి, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి ఉమ్మడి శ్రీకాకుళం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, పాతపట్నం బీజేపీ ఇన్‌చార్జి సలాన శరత్‌ల చేతుల మీదుగా బాధిత కుటుంబానికి రూ.13వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ నేపథ్యంలో వైద్యసిబ్బందితో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జనసేనపార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శులు కొంండ్రా వరప్రసాద్, చిట్టి భాస్కర్, శంకర్‌యాదవ్, ఎస్.సిద్ధయ్య, గొర్లె అనురాధ, లతా, లక్ష్మి, లక్ష్మిపురం కిరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి నిరంతరం పనిచేసే పార్టీ తెలుగుదేశం పార్టీ అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు శ్రీకాకుళం పట్టణంలోని 80ఫీట్ రోడ్‌లో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ఒక సువర్ణ అక్షరాలతో గుర్తింపు పొందిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారి ఆత్మగౌరవం పెంచేవిధంగా పార్టీ పని చేస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్నో సంస్కరణలు, సంక్షేమ పథకాలు తీసుకువచ్చి ప్రజలకు మంచి పరిపాలన అందిస్తుందన్నారు. ఇది పేదల పార్టీ అని తెలిపారు. తెలుగుదేశంపార్టీలో కార్యకర్తలకు ఎప్పుడు సమచిత స్థానం ఉంటుందన్నారు. క్రియాశీలక సభ్యత్వాలు కోట్లలో ఉన్నాయని, కార్యకర్తకు అండగా రూ.5లక్షల బీమా సౌకర్యం పార్టీ కల్పిస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీలో తామంతా ఉండడం తమ అదృష్టమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చింతల రామకృష్ణ, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ అభిమానులు కేక్ కటింగ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ, నందమూరి తారక రామారావు జన్మదిన పురస్కరించుకొని శ్రీకాకుళం రూరల్ మండలం కొత్తపేటలో ఎన్టీఆర్ అభిమానుల మధ్య శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ కట్ చేశారు. ఈ సందర్భంగా అభిమానుల మధ్య జన్మదిన వేడుక జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి రామారావు తెలుగు వారికి ఆశా దీపమని, తెలుగువారి ఆత్మగౌరవం, ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన, గొప్ప నేతన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తిని మనం గౌరవించుకోవడం ఆయన జన్మదిన తెలుగువారి జన్మదినంగా ప్రజలు గుర్తిస్తున్నారని, ఇది మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి


(సత్యంన్యూస్, రణస్థలం)

కనీస వేతనం రూ.26 వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. కార్మిక, ఉద్యోగ హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో రణస్థలం రామతీర్థం జంక్షన్ నుండి తహశీల్దారు కార్యాలయం జంక్షన్ వరకు జాతీయ రహదారిపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ.26వేలుగా నిర్ణయించి అమలు చేయాలన్నారు. కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను, ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్నం భోజన పథకం తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించేలా, పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని అన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్.ఐ.సి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను అమలు చేస్తున్నారన్నారు. బీజేపీ ధనవంతులకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందని ప్రజలపై భారాలు వేస్తుందని అన్నారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.కాంతమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు




## తెలుగు మీడియం రద్దు చేయడం దుర్మార్గం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని సంస్కరణల పేరిట నాశనం చేయడానికి ఉపాధ్యాయ సంఘాలు ఉపేక్షించవని ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన దుర్మార్గమైన జీవో 117 కారణంగా సుమారు మూడు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అవే విధానాలను అవలంబించడం దురదృష్టకరమన్నారు. గత ప్రభుత్వం ఏడు రకాల పాఠశాలలను ప్రతిపాదించి అమలు చేయగా నేటి ప్రభుత్వం 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడం మరింత నష్టదాయకమని అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ లో తెలుగు మీడియం లేకపోవడం విద్యారంగ నాశనానికి కారణమవుతుందని, సమాజం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తెలుగు మీడియంను ఇంగ్లీష్ మీడియంతో సమాంతరంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉండే 13325 పంచాయతీలలో సగం పంచాయతీలలో మాత్రమే ప్రైమరీ మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. 13325 పంచాయతీల్లో కూడా మోడల్ ప్రైమరీ స్కూల్స్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం అమలు చేస్తున్న ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి వలన విద్యార్థుల సమగ్రాభివృద్ధికి, అభ్యసనకు తీవ్ర ఆటంకం కలుగుతున్నదని, నిష్పత్తిని తగ్గించాలన్నారు. ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:35 గా చేయాలని, ప్రాథమికోన్నత పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా సబ్జెక్టు టీచర్లను కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక తరగతి గది, ఒక ఉపాధ్యాయుడు అన్ని పాఠశాలలకు మౌలిక సౌకర్యాలు ఉండే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు కుదించడం, సెక్షన్లు తగ్గించడం, ఒకే మీడియం అమలు చేయడం, పాఠశాలలు మూసివేయడం కారణంగా వేలాదిమంది ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా మిగులు ఉపాధ్యాయులుగా మారుతున్నారని, విద్యారంగాన్ని లాభాపేక్షతో చూడకుండా సమాజానికి విద్య భవిష్యత్తు పెట్టుబడిగా భావించాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్నారని సబ్జెక్టు ఉపాధ్యాయులను కేటాయించకుండా ఆ విద్యార్థులకు అన్యాయం చేయడం సరి కాదన్నారు. స్కూల్ అసిస్టెంట్లను సర్ప్లస్‌గా చూపించి ప్రాథమిక పాఠశాలలకు పంపించడం ఏ విధంగా విద్యాభివృద్ధికి దోహదం చేస్తుందో తెలపాలని కోరారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్ పోస్టులైన ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్లతో నింపేస్తే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ప్రమోషన్లు లేకుండానే సర్వీసులను ముగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను మిగులు ఉపాధ్యాయులుగా చూపించి క్లస్టర్లో, డీఈఓ పుల్‌లో, రాష్ట్ర విద్యాశాఖ పూల్లో ఉంచడం వలన విద్యారంగానికి ఏ విధమైన ప్రయోజనం అని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల్లో రేషన్లైజేషన్ బదిలీలు అంటే భయాందోళనలు ఏర్పడి తీవ్రమైన అశాంతికి ఒత్తిడికి గురవుతున్న పరిస్థితిని ప్రభుత్వం తీసుకురావడం సరి కాదన్నారు. రాష్ట్రంలో ఉండే ఉపాధ్యాయ సంఘాలన్నీ ఐక్యమై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యార్థుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో మే 21న, రాష్ట్రస్థాయిలో మే 23న పోరాటానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి వెంటనే స్పందించి విద్యారంగ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులంతా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయ సంక్షేమం కోసం జరుగుతున్న పోరాటంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థులకు యోగా అవసరం




(సత్యంన్యూస్, లావేరు)

ప్రతి విద్యార్థి చదువులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత కావాలంటే యోగా చేయాలని యోగా శిక్షకులు, అభ్యాసకులు 76 సంవత్సరాల వృద్ధులు పప్పు మల్లేశ్వరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం యోగా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా, శారీరకంగా కృంగిపోతున్నారని, చదువుపై శ్రద్ధ చూపడం లేదని, అందువలన విద్యార్థులకు యోగా అవసరమన్నారు. ప్రాణాయామం, పద్మాసనం, వజ్రాసనం, పర్వతాసనం, మయూరాసనంతోపాటు 12 భంగిమల సూర్య నమస్కారాలు విద్యార్థులతో వేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



















# తండ్రి మృతి.. కొడుకు ఆస్పత్రిపాలు

- పిడుగుపాటుతో మరో ఇద్దరికి గాయాలు
- బలగ బాబమ్మనగర్ కాలనీలో పండగ వేళ విషాదం
- మరో రెండురోజులు పిడుగులు, వర్షాలు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వాతావరణం ఒక్కసారి మారిపోయింది. బంగాళా ఖాతంలో తుపాను ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తుండగా.. శ్రీకాకుళం నగరంలో పిడుగు పాటుకు ఒక వ్యక్తి మృతి చెందాడు. బలగ బాబమ్మనగర్ కాలనీకి చెందిన గేదెల రాజారావు (55) మృతిచెందగా మరో ముగ్గురు తీవ్రగాయాల పాలయ్యారు. అధికారుల సమాచారం ప్రకారం మంగళవారం ఉదయం నాగావళిలో పొట్టేలు పొట్టు శుభ్రం చేస్తున్న వ్యక్తులు పిడుగుపాటుకు గురయ్యారు. దాంతో రాజారావు అనే వ్యక్తి అక్కడే మృతిచెందాడు. రాజారావు కుమారుడు నాగార్జునతో పాటు బలగ బుచ్చిపేటకు చెందిన దేశెళ్ల రాజారావు, బైరి రామారావు గాయపడ్డారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను ఆస్పత్రిలో చేర్పించి, మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుడు రాజారావు తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజారావు మృతితో అమ్మవారి పండగలతో సందడిగా ఉన్న బలగలోని బుచ్చిపేటలో విషాదం అలముకుంది. పండగల కోసం వచ్చిన బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

**మంత్రి దిగ్భ్రాంతి**

రాజారావు మృతి పట్ల వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే అవకాశం ఉందని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు.





# మృత్యు కుహరాల్లా కల్వర్టులు

- పూడికతీతకు సిమెంటు పలకలు తొలగింపు
- తిరిగి సక్రమంగా అమర్చకపోవడంతో ఇబ్బందులు
- విరిగినవాటి స్థానంలో కొత్తవి అమర్చని సిబ్బంది
- కల్వర్టు ఖాళీల్లో దిగబడిపోతున్న వాహనాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలో మురుగు కాలువల కల్వర్టులపై ఉన్న సిమెంట్ పలకలు విరిగి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కొన్నిచోట్ల కల్వర్టులకు మరమ్మతులు చేయగా, మరికొన్ని చోట్ల పలకలు తొలగించి కాంక్రీట్ నిర్మాణం చేశారు. కొన్ని కాలనీల్లో కల్వర్టులు తెరిచి పూడిక తీశారు. ఇందుకోసం కల్వర్టులపై ఉన్న పలకలను జేసీబీలతో తీసి, మళ్లీ పెట్టే క్రమంలో చాలావరకు పాడైపోతున్నాయి. వాటి స్థానంలో కొత్తవి పెట్టడం లేదు. పాడైనవాటిని పక్కన పెట్టేసి ఉన్న పలకలనే కల్వర్టులపై సర్దేస్తున్నారు. దీంతో మధ్యలో ఖాళీలు ఏర్పడి ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో కార్ల ముందు చక్రాలు కల్వర్టుల్లో దిగిపోతున్న పరిస్థితి. కిమ్స్ రోడ్డు నుంచి ముచ్చువానిపేట మీదుగా పీఎన్ కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు పూర్తిగా పాడై మురుగునీరు రోడ్డు మీదకు చేరుతుంది. ముచ్చువానిపేట కాలనీ వద్ద ఉన్న కల్వర్టు డౌన్‌లో ఉండడం, పలకలు మధ్య ఖాళీలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. కల్వర్టు మీదుగా వెళ్లే కార్లు కుంగిపోతున్నాయి. వర్షాకాలంలో కల్వర్టు మీద నుంచే కాలనీలోని వరదంతా ప్రవహిస్తుంది. ప్రతి రోజు వందలాది కార్లు, స్కూల్ బస్సులు తిరుగుతున్న ఈ రోడ్డులో పాడైన కల్వర్టును మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సోమ, మంగళవారాలు కురిసిన తేలికపాటి వర్షానికే రెండు కార్లు కల్వర్టులో చిక్కుకున్నాయి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి కాలువను ఎత్తు చేసి దానిపై సిమెంట్ కాంక్రీట్‌తో కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



# డీ పట్టా ఆక్రమణలో చెట్టపట్టాల్!



- టీడీపీ, వైకాపా నాయకుల జాయింట్ వెంచర్
- 2.39 ఎకరాలు ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు

(సత్యంన్యూస్, కొత్తూరు)

వారు రాజకీయంగా నిత్యం పోటీ పడే రెండు పార్టీలకు చెందినవారు. రాజకీయంగా పరస్పరం విభేదిస్తున్నా అక్రమాల విషయంలో చెట్టపట్టాలు వేసుకుని పని చేస్తున్నారు. నిరుపేదలకు ఇచ్చిన డీ పట్టా భూములను కలిసికట్టుగా ఆక్రమించేశారు. కొత్తూరు మండలం మెట్టూరు పంచాయతీ నేరడి గ్రామంలో 20 ఏళ్ల క్రితం ఐదు ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం 2.39 ఎకరాల డీ పట్టా భూమి ఇచ్చింది. సర్వే నెం. 114లో గయాల్‌గా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్న ఈ భూమిలో సవర ముఖలింగానికి 31సెంట్లు, సవర చిన్నారావుకు 31 సెంట్లు, అలికాన సంజీవరావుకు 91 సెంట్లు, బాడాన కరువుకు 41 సెంట్లు, అలికాన దేవదాస్‌కు 31 సెంట్లు చొప్పున డీపట్టా రూపంలో ప్రభుత్వం అందజేసింది. ఆ మేరకు ఆ ఐదు కుటుంబాలవారు ఆ భూముల్లో పంటలు సాగుచేస్తూ అనుభవించేవారు. కాలక్రమంలో లబ్ధిదారుల కుటుంబీకులు ఎవరూ అందుబాటులో లేకపోవడతో ఈ భూములపై అక్రమార్కుల కళ్లు పడ్డాయి. అలికాం-కొత్తూరు ప్రధాన మార్గంలో ఒకేచోట 2.39 ఎకరాలు ఉండడం, బహిరంగ మార్కెట్‌లో భూమి విలువ ఎక్కువగా ఉండడంతో కొందరు టీడీపీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పి దీన్ని సొంతం చేసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. గతంలోనే దీన్ని సొంతం చేసుకోవడానికి ప్రయత్నించి విఫలమైన వైకాపా నాయకులు ఇప్పుడు టీడీపీ వారితో చేతులు కలిపి ఆ భూమిలో పక్కా నిర్మాణాలు ప్రారంభించారు. వైకాపా హయాంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి ఇదే భూమిని అప్పటి ఎమ్మెల్యే రెడ్డి శాంతి పరిశీలించారు. అయితే భూమి ఎస్సీ, ఎస్టీలకు చెందినదని రెవెన్యూ అధికారులు చెప్పడంతో మెట్టూరు-2లో ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. కాగా ఇప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే సమీప బంధువైన వెంకటరమణతో పాటు స్థానిక టీడీపీ నాయకుడు కమలాకర్ కనుసన్నల్లో ఆక్రమణదారులు డీ పట్టా భూమిని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. ఈ విషయంలో కొందరు వైకాపా నేతలు కూడా వారితో జత కలిశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన మార్గంలోనే భారీ నిర్మాణం జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్నా పంచాయతీ అధికారులు స్పందించకపోవడంపైనా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# నగరానికి వరదొచ్చింది..!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అవునండీ.. నగరానికి వరదొచ్చింది. కానీ నాగావళి పొంగిపోయి రాలేదు. పడిన వర్షం నీరు కాలువల వెంట నాగావళిలోకి చేరక ఈ వరదొచ్చింది. నగరంలో పల్లపు ప్రాంతాలతో పాటు ఎత్తుగా ఉన్న ప్రదేశాలు కూడా వర్షం కారణంగా మునిగిపోయాయి. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శక్తి తుపానుగా మారి అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. అయితే మెయిన్ కెనాల్స్ సరిగా లేకపోవడం, చాలావరకు కాలువలు డెబ్రిస్‌తో నిండిపోవడం వల్ల మొత్తం నగరమంతా జలమయమైంది. కార్పొరేషన్ అధికారులు మెయిన్ రోడ్లలో ఉండే కాలువల్లో మురుగు తొలగించి, ముహూర్తం కుదరక అక్కడ ఉంచేస్తుండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. బాకర్ సాహెబ్‌పేట, న్యూకాలనీ, మాధవ మోటార్స్ నుంచి రైతుబజార్, డే అండ్ నైట్ జంక్షన్, ఇలాగే పీఎస్ఎన్ఎం స్కూల్ వెనుక వైపు నీటితో నిండిపోవడంతో ద్విచక్ర వాహనాలు ఆగిపోయాయి. నగరంలో కాలువలు ఎప్పటికి బాగుపడతాయో గానీ చిన్నపాటి వర్షాలకు కూడా నీరు నిలిచిపోతుండటంపై ప్రజలు కార్పొరేషన్‌తో పాటు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు.

## ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా
# ఉచిత కంప్యూటర్ కోర్స్ శిక్షణ

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస మండలం దన్నానపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉచితంగా కంప్యూటర్ కోర్స్ మూడు నెలల శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్ అందజేస్తారు. శిక్షణ పూర్తయిన తర్వాత వివిధ పారిశ్రామిక సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, పదో తరగతి ఉత్తీర్ణత చెందిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎ.గోపి ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 75690 77449 నెంబరును సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలియజేశారు.












Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.